



# నా తాతగారి దేవుడు

స్టానిస్లాస్ - న్యూ కాలెడోనియా

స్టానిస్లాస్ సంస్కృతి, విశ్వాసం మరియు సంప్రదాయాలను నిష్టగా పాటించే క్రైస్తవ ఇంట్లో పెరిగాడు. వారి కుటుంబములోని ఎనిమిది మంది పిల్లలలో స్టానిస్లాస్ రెండవవాడు, మరియు అతని చిన్నతనంలో తానూ పొందిన ప్రేమ మరియు సంతోషంతోకూడిన కుటుంబ జీవిత జ్ఞాపకాలతో నిండి ఉన్నాయి. కానీ అతని తండ్రి కారు ప్రమాదంలో మరణించినప్పుడు కుటుంబంలో తీవ్రమైన విషాదం అలుముకుంది. ఆ సమయంలో, స్టానిస్లాస్ తల్లి గర్భవతిగా ఉంది. ఎనిమిదవ బిడ్డ జన్మించనైయున్నది. పిల్లలను ఒంటరిగా చూసుకోలేక, ఆమె వారిని వారి తాత అమ్మమ్మలతో నివసించడానికి పంపింది. స్టానిస్లాస్ మొదట నిష్టతో కూడిన ఆధ్యాత్మిక భక్తిని చూసింది అతని తాత అమ్మమ్మల ఇంట్లోనే. ప్రతి ఉదయం, కొవ్వొత్తి మండుతున్న సున్నితమైన సువాసన మరియు ప్రార్థనలో తన తాత అమ్మమ్మలు మోకాళ్లపై ఉండటం చూసి అతను మేల్కొనేవాడు. నమ్మకమైన చర్చి ఉద్యోగి అయిన అతని తాత దేవుని సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసుకొనిఉన్నాడు.

చిన్నపిల్లవాడు అయినప్పటికీ, స్టానిస్లాస్ ఇలా ఆలోచించడం ప్రారంభించాడు: “దేవుడు మంచివాడైతే, ఆయనను అంతగా ప్రేమించే నా తాతగారి లాంటి వారు ఎందుకు అంతగా బాధపడతారు?”

అతని మనసులోని ఆ సందేహం నిశ్శబ్దంగా కొన్ని సంవత్సరాలపాటు పెరుగుతూ వచ్చింది. అతను టీనేజ్‌కు చేరుకునే సమయానికి, స్టానిస్లాస్ దారితప్పి, ధూమపానం, మద్యపానం మరియు చివరికి దొంగతనం వైపు మొగ్గు చూపాడు. చిన్న చిన్నగా ప్రారంభమైన ఈ అలవాట్లు అతన్ని ప్రమాదకరమైన నేరములు చేయు జీవనశైలిలోకి నడిపించాయి. అతను దొంగతనాలు, కారు దొంగతనం మరియు మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో పాల్గొన్నాడు. దారి గమ్యం లేని అతనికి, బలవంతులు మాత్రమే మనుగడ సాగిస్తారను నియమాలను వీధులు నేర్పించాయి. తరువాత, ఒక రాత్రి, అతని పరిస్థితి అంతా మారిపోయింది. మద్యం సేవించి దొంగిలించబడిన కారును నడుపుచున్నప్పుడు, స్టానిస్లాస్ అకస్మాత్తుగా అతని హృదయంలో “నువ్వు ఏం చేస్తున్నావు? ఇలాగే నీ జీవితం ముగియాలని కోరుకుంటున్నావా?”అని హెచ్చరించిన ఒక స్వరం విన్నాడు.

ఆ మాటలకు వణకిపోయిన స్టానిస్లాస్, తాను ఇక ఇలా జీవించకూడదని గ్రహించాడు. మరుసటి రోజు ఉదయం, నేరాలను విడిచిపెట్టి కొత్తగా జీవితం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు.

తన జీవితాన్ని పునర్నిర్మించుకోవడానికి అతను తన స్వస్థలానికి తిరిగి వచ్చాడు. అయితే అది అంత సులభంగా జరగలేదు. అందుకు ఏడాదిన్నర సమయం పట్టింది. స్టానిస్లాస్ తన నిర్ణయం నందు దృఢంగా ఉన్నాడు. 18 సంవత్సరాల వయసులో, అతను సైన్యంలో చేరాడు, శిక్షణ పూర్తి చేశాడు మరియు చివరికి స్థిరమైన ఉద్యోగం పొందాడు.

తరువాత, అతను ఒక స్త్రీని కలిశాడు, మరియు వారు ఇద్దరు కలిసి జీవితాన్ని ప్రారంభించారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు, మరియు కొంతకాలం అంతా బాగానే ఉంది. కానీ పాత జీవితపు పరిష్కరించబడని సమస్యలు తలెత్తడం ప్రారంభించాయి, ఇది వారి వ్యక్తిగత సంబంధంలో ఉద్రిక్తతను సృష్టించింది. చివరికి, ఆ జంట విడిపోయారు.

కొంతకాలం తర్వాత, ఆ మహిళ తండ్రి స్టానిస్లాస్‌కు ఫోన్ చేసి తన కుమార్తెకు మరొక అవకాశం ఇవ్వమని అడిగాడు. అందుకు అతను అంగీకరించాడు.

అతని భాగస్వామి సెవెంత్-డే అడ్వెంటిస్ట్ కుటుంబంలో పెరిగింది. ఆమె చర్చికి దూరంగా ఉన్నప్పటికీ, ఆమె ప్రతిరోజూ తన బైబిల్ చదువుతుంది. ఒకరోజు, ఆమె స్టానిస్లాస్‌తో, "నేను చర్చికి తిరిగి వెళ్లాలనుకుంటున్నాను" అని చెప్పింది. స్టానిస్లాస్ , "ఎందుకు వెళ్ళకూడదు? నేను మిగతావన్నీ ప్రయత్నించానుబహుశా ఇప్పుడు యేసును ప్రయత్నించే సమయం ఆసన్నమైంది."అని జవాబిచ్చాడు.

ఆదివారం అతను చర్చికి వెళ్లడం ప్రారంభించగా, ఆమె సబ్బాతు రోజున చర్చికి వెళ్లడం ప్రారంభించింది. కొన్నిసార్లు, ఆమె అతనితో కలిసి ఆదివారం చర్చికి వెళ్ళింది, కానీ స్టానిస్లాస్ ఎప్పుడూ ఆమెతో సబ్బాతు రోజున చర్చికి వెళ్ళలేదు. అయినప్పటికీ, ఆమెలో ఏదో మార్పు కలిగిందని అతను గమనించాడు. ఆమె ప్రశాంతంగా మరియు సంతోషంగా ఉంది. ఆమెలో వివరించలేని శాంతి ఉంది.

ఒకరోజు, అతను ఆమెను అడిగాడు, "నువ్వు రోజంతా చర్చిలో ఎందుకు గడుపుతావు? మా చర్చి కేవలం రెండు గంటలు మాత్రమే ఉంటుంది." ఆమె నవ్వి, "నాతో పాటు మా చర్చికి రండి. మీకు అర్థమవుతుంది" అని చెప్పింది.

అతను అంగీకరించాడు మరియు ఆమె చర్చిలో ఆ మొదటి సబ్బాతు ఒక కీలకమైన మలుపు. చర్చిలో పాస్టర్ బోధించిన సందేశం స్టానిస్లాస్ ఊహించని విధంగా అతని హృదయాన్ని తాకింది. అతను ఇంకా యేసును పూర్తిగా అర్థం చేసుకోలేదు, కానీ అతనిలో ఏదో కదలిక మొదలయ్యింది. పాస్టర్ అతన్ని బైబిలు అధ్యయనాలు ప్రారంభించమని ఆహ్వానించాడు. అందుకు స్టానిస్లాస్ అంగీకరించాడు.

అతను బైబిల్ తెరిచినప్పుడు, చిన్నప్పటి నుండి తనను వెంటాడుతున్న సందేహాలకు, ప్రశ్నలకు సమాధానాలు కనుగొనడం ప్రారంభించాడు. దేవుని స్వరూపం పట్ల తనకున్న సందేహం నెమ్మదిగా తొలగిపోయింది. దొంగిలించబడిన ఆ కారులో సంవత్సరాల క్రితం తాను విన్న అదే స్వరం ఇప్పుడు మరలా తనతో మాట్లాడుచున్నదని లేఖనం ద్వారా అతను ఈసారి గ్రహించాడు.

ఒక రాత్రి, ఒక అధ్యయన సెషన్ తర్వాత, అతను తన భార్య వైపు తిరిగి, "నాకు ఇప్పుడు విశ్వాసం ఉందని నేను అనుకుంటున్నాను. చివరకు దేవునిని నమ్మడం అంటే ఏమిటో నేను అర్థం చేసుకున్నాను" అని అన్నాడు.

కొంతకాలం తర్వాత, వారు వివాహం చేసుకుని బాప్తిస్మం తీసుకున్నారు.

రెండు సంవత్సరాల తర్వాత, స్టానిస్లాస్ ఫిజిలోని అడ్వెంటిస్ట్ విశ్వవిద్యాలయంలో చేరాడు, అక్కడ అతను వేదాంతశాస్త్రంలో డిగ్రీని పొందాడు. నేడు, అతను న్యూ కాలెడోనియాలో పాస్టరుగా పనిచేస్తున్నాడు, అదే ద్వీపంలో, అతని ప్రయాణం ప్రారంభమైంది.

కానీ ఇప్పుడు, అతను తన తాతగారి దేవుడిని సేవిస్తున్నాడు అయితే సంప్రదాయంతో కాదు, నమ్మకం, ప్రేమ మరియు క్రీస్తుతో వ్యక్తిగత సంబంధంతో.

క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్ట్ ఆఫరింగ్ అని కూడా పిలువబడే మీ పదమూడవ సబ్బాతు కానుకలు , పాస్టర్ స్టానిస్లాస్ వెనెగ్వే వంటి వ్యక్తుల జీవితాలపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుంది. ఇది వాలిస్‌లో ప్రభావ కేంద్రాన్ని స్థాపించడంలో సహాయపడుతుంది, ఇది ఎడ్వెంటిస్టులు న్యూ కాలెడోనియా మిషన్ ప్రాంతంలోని ప్రజలతో అవగాహన మరియు స్నేహసంబంధాలు ఏర్పరచుకొనుటకు సహాయపడుతుంది.

-స్టానిస్లాస్ వెనెగ్వే